# నేడు రామారెడ్డికి ఎమ్మెల్సీ కవిత రాక



రామారెడ్డి, మార్చి 28: మండలంలోని ఇసన్న పల్లి –రామారెడ్డి గ్రామాల్లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం సందర్శించనున్నారు. ఉదయం 9 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులతో సమావేశమవుతారు. 11 గంటలకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో నిర్వహించనున్న బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొంటారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

## మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ఊరట



ఆర్మూర్‌టౌన్, మార్చి 28: ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. ఆయనను అరెస్టు చేయొద్దని మోకిలా పోలీసులను ఆదేశించింది. తన భూమిని లాక్కున్నారని సామ దామోదర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీవన్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులపై గతంలో మోకిలా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై జీవన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తమపై నమోదైన కేసులను కొట్టి వేయాలని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే, భార్యకు, తల్లికి బెయిల్ ఇచ్చిన హైకోర్టు జీవన్‌రెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. జీవన్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, నిరంజన్‌రెడ్డి వాదించారు. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం జీవన్‌రెడ్డికి ఊరట కల్పిస్తూ ఆయనను అరెస్టు చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది.

## సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

బాన్సువాడ, మార్చి 28: బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. నస్రుల్లాబాద్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వేధింపులకు బొమ్మన్‌దేవ్ పల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సువర్ణ ఫినాయిల్ తాగి ఆత్మహత్యా యత్నం చేసుకోగా..ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. విచారణ చేపట్టి న్యాయం చేస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ ఖలీల్ మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారుల వేధింపులు ఆపాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సురేజ్‌గౌండా, ప్రాజెక్టు అధ్యక్షురాలు మహాదేవి, కార్యదర్శి రాధ, రేణుక, వజ్ర తదితరులు పాల్గొన్నారు.

**పొట్టదశలో పంటలకు అందని సాగునీరు**

**అడుగంటుతున్న భూగర్భ జలాలు..**

**వట్టిపోతున్న బారుబావులు**


**జీవాలకు మేతగా ఎండిన పంటలు**

## ఎండుతున్న ‘ఎవుసం’

# రైతన్న పరిస్థితి దైన్యం

సిరికొండ, మార్చి 28: యాసంగి సాగు భారంగా మారింది. సాగునీరందక పంటలు ఎండిపోతుండడం రైతులను కలిచివేస్తున్నది. బోరుబావుల మీద ఆధారపడిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పొలాల్లో వేసిన బోర్లు వట్టిపోతున్నాయి. దీంతో సాగుచేసిన పంటలు సగానికి సగం ఎండిపోగా ప్రస్తుతం చివరి తడులకు వచ్చేసరికి వాటిని కూడా కాపాడుకోలేని దీనస్థితి ఏర్పడింది. ఇప్పటికే మండలంలోని చాలా ప్రాంతాల్లో భూగర్భజల వనరులు పడిపోయి నీరందక పంటలు ఎండిపోయాయి. ఉన్న కొద్దిమేర పంటలనైనా దక్కించుకోవాలన్న తపనతో సాగునీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు. రూ.లక్షలు ఖర్చుచేసి ఐదు నుంచి ఆరు వందల ఫీట్ల వరకు బోర్లు తవ్విస్తున్నా.. చుక్క నీరు పడడం లేదు. కండ్ల ఎదుటే పచ్చని పంట పొలాలు ఎండిపోతుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. కొందరు రైతులు ఖర్చుకు సైతం లెక్క చేయకుండా వాటర్ ట్యాంకులతో నీళ్లు లభించే సుదూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పొలాలకు చివరి తడులు అందిస్తూ పంటను గట్టుకు ఎక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఎండిన పంట పశువుల పాలవుతున్నది. ప్రభుత్వం ఎండిన పంటలకు పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు

**వంద ట్యాంకర్ల నీరు.. ఎండిన పైరు**




**పక్క ఫొటోలో** కనిపిస్తున్న పొలం సిరికొండ గ్రామానికి చెందిన పారిపల్లి శ్రీనివాస్‌ది. తనకున్న మూడెకరాల్లో సన్న రకం వడ్లను సాగు చేశాడు. బోరుబావిలో నీటి శాతం తగ్గిపోవడంతో రెండెకరాలు ఎండిపోయింది. పొట్ట దశలో ఉన్న పంటకు సుమారు వంద ట్యాంకర్ల నీటిని అందించినా ఫలితం లేకుండా పోయింది. 20 ఏండ్లుగా బోరుబావి నుంచి పుష్కలంగా నీరు వచ్చిందని, ఈ యాసంగిలోనే వట్టిపోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు.

**ఫెయిలైన బోర్లు.. మీద పడ్డ అప్పులు**



**పక్క చిత్రంలో** కనిపిస్తున్న రైతు పేరు మలావత్ ప్రవీణ్. పందిమడుగు గ్రామానికి చెందిన ఆయన ఏడు ఎకరాల్లో సన్నరకం వరిని సాగు చేశారు. రెండు తడులు అందిస్తే పంట చేతికొచ్చేదశలో నీరందక పూర్తిగా ఎండిపోయింది. రూ.లక్షలు ఖర్చు చేసి నాలుగు బోర్లు తవ్వించినా.. ఫలితం లేకుండా పోయింది. సాగుకు పెట్టుబడి, పంటను కాపాడుకోవడానికి తవ్వించిన బోరు బావుల ఖర్చుతో అప్పుల పాలైనట్లు ఆందోళన చెందుతున్నాడు.

**మూడు బోర్లు.. కానరాని నీరు..**



**ఈ చిత్రంలో** కనిపిస్తున్న వరి పందిమడుగు గ్రామానికి చెందిన మలావత్ మహిపాల్ చెందినది. తనకున్న మూడెకరాల్లో వరి సాగు చేయగా.. 20 రోజుల నుంచి బోరు బావుల్లో నీరు సరిగా రావడం లేదు. దీంతో పంట ఎండిపోతున్నది. రూ.60వేల వరకు అప్పు చేసి మూడు బోరుబావులు తవ్వించినా చుక్క నీరు రాలేదు. ఎండిన వరిపైరు పశువులకు మేతగా మారింది.

# నగరంలో కిరాతకం...

**ఇందూరులో** ఒకే రోజు మూడు మృతదేహాలు లభ్యం కావడం కలకలం రేపింది. రోడ్డు పక్కన ఓ బాలుడు విగతజీవిగా కనిపించగా, కారు డిక్కీలో మహిళ మృతదేహం లభించడం చర్చనీయాంశమైంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న మరో మహిళను దారుణంగా హతమార్చి నగలతో ఉడాయించిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.

## కారు డిక్కీలో మహిళ శవం

- వివాహిత దారుణ హత్య
- మృతదేహాన్ని తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



కారు వద్ద డెడ్‌బాడీని పరిశీలిస్తున్న పోలీసులు

వినాయక్‌నగర్, మార్చి 28: వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు కారు డిక్కీలో మహిళ మృతదేహం లభ్యం కావడంతో కంగుతిన్నారు. నిజామాబాద్ రూరల్ ఠాణా పరిధిలోని బైపాస్ రోడ్‌లో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పోలీసులు రోజులానే బైపాస్ రోడ్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారును ఆపి సోదా చేస్తుండగా, డిక్కీలో మహిళ మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు ఒక్కసారిగా కంగుతిన్నారు. హతురాలు ఎవరనేది ఆరా తీయగా, ముబారక్‌నగర్ ప్రాంతానికి చెందిన కమల (50)గా తేలింది. హత్య కేసు నమోదు చేసిన రూరల్ ఠాణా పోలీసులు.. మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. కమలను ఎవరు, ఎందుకు హత్య చేశారనే దానిపై ముమ్మర దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

**పోలీసుల అదుపులో నిందితుడు?**

మహిళను హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ సురేశ్ విచారిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మహిళను ఎందుకు చంపింది నిందితుడు వెల్లడించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ముబారక్‌నగర్‌కు చెందిన కమల కొందరు మహిళలతో వ్యభిచారం చేయిస్తుండేదని తెలిసింది. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళను కూడా ఈ రొంపిలోకి దింపినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన సదరు మహిళ కుమారుడు.. తన తల్లితో తప్పుడు పని చేయిస్తున్న కమలపై కక్ష కట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కమలను కారులో ఎక్కించుకుని డిచ్‌పల్లి ఠాణా పరిధిలోకి తీసుకెళ్లి కల్లు తాగించిన అనంతరం హత్య చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మృతదేహం దొరకకుండా చేసే ప్రయత్నంలో భాగంగా కారులో తరలిస్తూ పోలీసులకు చిక్కినట్లు తెలిసింది.

## రోడ్డు పక్కన బాలుడి మృతదేహం

**కొట్టి చంపినట్లుగా అనుమానిస్తున్న పోలీసులు**



బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న నగర సీఐ

వినాయక్‌నగర్, మార్చి 28: నిజామాబాద్ నగరంలోని ఉమెన్స్ కాలేజ్ రోడ్డు పక్కన శుక్రవారం సాయంత్రం ఓ బాలుడి మృతదేహం కనిపించడం కలకలం రేపింది. బాలుడి ఒంటిపై గాయాలు ఉండడంతో కొట్టి చంపినట్లు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉమెన్స్ కాలేజ్ సమీపంలో రోడ్డు పక్కన బాలుడి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. నగర సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై హరిబాబు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సుమారు 2 సంవత్సరాల వయస్సు గల బాబు తలపై గాయాలు ఉండడంతో ఎవరైనా కొట్టిచంపినట్లు అనుమానించారు. అయితే, బాలుడు ఎవరనేది విచారించగా, మహారాష్ట్రకు చెందిన వారిగా తేలింది. పర్భాణికి చెందిన కమలాబాయి తన ముగ్గురు పిల్లలతో పాటు బంధువులు ఇద్దరితో కలిసి భిక్షాటన కోసం గురువారం ఉదయం నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అయితే, శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో తమ బాలుడు కనిపించడం లేదని కమలాబాయి ఒకటో టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మరోవైపు, కంఠేశ్వర్ సమీపంలో బాలుడు విగతజీవిగా కనిపించడంతో పోలీసులు విచారణ చేపట్టారు. అదృశ్యమైన కమలబాయి కుమారుడిగా గుర్తించి, మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

## ఒంటరి మహిళ హత్య

- ఒంటిపై నుంచి నగలు ఎత్తుకెళ్లిన దుండగులు
- నాల్గు రోజుల తర్వాత ఘటన వెలుగులోకి..

వినాయక్‌నగర్, మార్చి 28: ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఓ మహిళను హత్యచేసి ఆమె ఒంటిపై ఉన్న నగలను దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటన నిజామాబాద్ మండలంలోని పాంగ్రా బోర్గాంలో చోటుచేసుకోగా..ఆలస్యంగా వెలుగుచూసింది. నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పాంగ్రాకు చెందిన చారుగొండ చంద్రకళ(55) ఇంట్లో ఒంటరిగా ఉంటున్నది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు కాగా.. పెండ్లిలు కావడంతో అత్తారింట్లో ఉంటున్నారు. ఈ నెల 23న పెద్ద కూతురు మౌనిక ఫోన్‌లో తల్లితో మాట్లాడింది. మరుసటి రోజు నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో భర్తతో కలిసి మౌనిక పాంగ్రాకు వచ్చి ఇంటి తలుపు తెరిచిచూడగా తల్లి చనిపోయి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుండగులు ఆమె తలపై పదునైన ఆయుధంతో కొట్టి హత్య చేసి,ఆమె చెవులకు ఉన్న బంగారు కమ్మలు, మాటీలు ఎత్తుకుపోయినట్లు నిర్ధారించారు. మృతురాలి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఈ నెల 23న రాత్రి లేదా 24న చంద్రకళ హత్య జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు.

## రుణమాఫీపై నిలదీత

- 210 మంది రైతుల్లో 78 మందికే చేశారంటూ రైతుల ఆగ్రహం
- కొంతమందికే ఎరువులు అందాయని మండిపాటు



విండో చైర్మన్‌తో మాట్లాడుతున్న రైతు

రుద్రూర్, మార్చి 28: రుణమాఫీపై రుద్రూర్ విండో పాలక వర్గాన్ని రైతులు నిలదీశారు. సొసైటీలో 210 మంది రైతులు ఉంటే కేవలం 78 మందికి రుణమాఫీ వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విండో చైర్మన్ సంజీవ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 90వ మహాజన సభ రసాభాసగా మారింది. రుణమాఫీ తమకు వర్తించలేదని కొంత మంది రైతులు ప్రశ్నించగా త్వరలో మాఫీ వస్తుందని కార్యదర్శి లక్ష్మణ్ సమాధానం ఇచ్చారు. ఎరువులు కూడా కొంతమందికే అందాయని సభాదృష్టికి తీసుకెళ్లగా.. ముందుగా అడ్వాన్స్ ఇచ్చినవారికి పంపిణీ చేసినట్లు కార్యదర్శి బదులివ్వడంతో రైతులు మండిపడ్డారు. చిన్నరైతులకు అందడంలేదని వాపోయారు.కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతుల జాబితా ఇవ్వాలని పలువురు కోరగా.. తమ వద్దలేని కార్యదర్శి చెప్పడంతో రైతులు మండిపడ్డారు. ఈ సారైనా కొనుగోలు కేంద్రాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ముందుగా కోతకోసిన రైతుల ధాన్యాన్ని మాత్రమే సేకరించాలని రైతులు కోరగా.. విండో చైర్మన్ సంజీవ్‌రెడ్డి ఒప్పుకొన్నారు.

## ‘బోనస్’ బొక్కేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలి

**సీపీఐ నాయకుల డిమాండ్.. కోటగిరిలో రాస్తారోకో**



కోటగిరిలో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

కోటగిరి, మార్చి 28: సన్నరకం వడ్లకు ప్రభుత్వం ఇచ్చిన బోనస్ డబ్బులను రైతుల ముసుగులో కాజేసిన వారిపై సమగ్ర విచారణ చేపట్టి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కోటగిరి సొసైటీ చైర్మన్‌తోపాటు కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సీపీఐ ఆధ్వర్యంలో రైతులు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ మాట్లాడు తూ..రైతుల ముసుగులో బోనస్ డబ్బులు స్వాహా చేసిన సొసైటీ చైర్మన్‌తోపాటు రైస్‌మిల్లులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అండ చూసుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి బోనస్ డబ్బులు రికవరీ చేయాలని లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ నుంచి తహసీల్ ఆఫీస్ వరకు ర్యాలీగా తరలివచ్చి ధర్నా చేపట్టి, నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. రైతులు బుట్ట గంగాధర్, సాయిలు, రాములు, పూదరి సాయిలు, ఆకుల లక్ష్మణ్, శంకర్, చిత్తరి శ్రీనివాస్, సీపీఐ నాయకులు నల్ల గంగాధర్, గుడాల రాములు, శంకర్, హన్మండ్లు, శివరాజ్, సోమ వీరేశం పాల్గొన్నారు.

## రంజాన్ సందడి









కొనుగోలుదారులతో సందడిగా మారిన జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ ప్రాంతం

**ఈ నెల 31న రంజాన్ నేపథ్యంలో** నగరంలో పండుగ సందడి నెలకొన్నది. ముఖ్యంగా బోధన్‌రోడ్డు, గాంధీచౌక్ ప్రాంతాలు షాపింగ్ కోసం వచ్చిన వారితో కిక్కిరిసిపోతున్నాయి. తెల్లవారుజాము వరకు షాపులు తెరిచి ఉంచడంతో కొనుగోలుదారుల రద్దీ ఎక్కువగా ఉంటున్నది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్